సాక్షి పల్నాడు

మంగళవారం । 13 । మే । 2025



ఘనంగా అంకమ్మతల్లి వార్షికోత్సవం

పెదకూరపాడు: 75త్యాళ్లూరులో వైశాఖ పౌర్ణమి సందర్భంగా అంకమ్మతల్లి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పొంగళ్లు సమర్పించారు.



భక్తిశ్రద్ధలతో చండీహోమం

దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



వైభవంగా సీతారామ శాంతికల్యాణం

రేపల్లె: రేపల్లె ఒకటో వార్డు ఎస్టీ కాలనీలోని సీతారామ మందిర వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. శాంతి కల్యాణం కనుల పండువగా జరిగింది.

వెంకాయమ్మ బంధువు...

ఆమె చెప్పిందే వేదం

చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు రూటే సప'రేటు'

ఆయన చేతిలో లాఠీ 'పసుపు' రంగు పులుముకుని ప్రతిపక్షాలపై కరాళ నృత్యం చేస్తుంటుంది. ఆయన వేసుకున్న ఖాకీ యూనిఫాం బంధుప్రీతికి సలాం కొడుతుంటుంది. ఆయన స్టేషన్‌లో న్యాయం.. ప్రత్యర్థులను అక్రమ కేసుల ఉచ్చులో బిగిస్తూ సమాధిగా మారిపోతుంటుంది. ఆయన చేతిలో చట్టం.. అధికారానికి కొమ్ముకాస్తూ, అక్రమాలకు వంత పాడుతూ, అమాయకులను బలి తీసుకుంటుంది. ఆయన విధి నిర్వహణ.. పేకాట, రేషన్ బియ్యం, బెట్టింగ్ మాఫియా వద్ద మామూళ్ల మత్తులో మునిగి తేలుతూ పోలీసు వ్యవస్థకే కళంకం తీసుకొస్తుంటుంది. ఇదీ మొత్తం ఖాకీలపై నమ్మకానికి పాతరేసి, అవినీతి, అక్రమాలకు పోలీసు స్టేషన్‌ను నిలయంగా మార్చిన చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు కథ. పేట కోటను దౌర్జన్యాలకు అడ్డాగా చేసి చట్టానికి నిలువెల్లా తూట్లు పొడిచిన వ్యథ.

- ఎమ్మెల్యే పుల్లారావు భార్య సమీప బంధువని చెప్పుకుంటూ అరాచకాలు
- ఉన్నతాధికారుల ఆదేశాల కన్నా ఆమె మాటే సీఐకి శాసనం
- వైఎస్సార్‌సీపీ నేతలు, సానుభూతిపరులే టార్గెట్‌గా అక్రమ కేసులు
- సోషల్ మీడియా యాక్టివిస్టులపై వేధింపులు
- టీడీపీ నేతల ఆదేశాలతో 'పచ్చ' పోలీసింగ్
- పేకాట, రేషన్ బియ్యం, గ్రానైట్ అక్రమ రవాణాలో భారీగా నెలవారీ మామూళ్లు
- తాజాగా ఓ క్రికెట్ బుకీని అక్రమంగా నిర్బంధించి రూ.లక్షల్లో వసూలు



చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు భార్య వెంకాయమ్మ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని స్వామి భక్తి చాటుకుంటున్న రూరల్ సీఐ సుబ్బనాయుడు (ఫైల్ ఫొటో)

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు భార్య వెంకాయమ్మ తనకు దగ్గర బంధువని చెప్పొకొనే చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఉన్నతాధికారుల ఆదేశాల కన్నా ఆమె చెప్పిన మాటలే ఆదేశాలుగా తు.చ. తప్పకుండా అమలు చేస్తూ స్వామి భక్తి చాటుకుంటున్నాడు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల అణచివేతే లక్ష్యంగా అక్రమ కేసులతో వేధించడం ఆయన ప్రథమ కర్తవ్యంగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో శనివారం మాజీ మంత్రి విడదల రజిని అనుచరుడు శ్రీకాంత్‌రెడ్డిని అక్రమ కేసులో అరెస్ట్ చేసేందుకు వచ్చి నానా హంగామా చేశాడు. అక్రమ అరెస్టును అడ్డుకున్న మాజీ మంత్రితో అనుచితంగా ప్రవర్తించాడు. ఏక వచనంతో సంబోధించి బెదిరింపులకు పాల్పడ్డాడు. మహిళా మాజీ మంత్రి అని కూడా చూడకుండా దౌర్జన్యంగా పక్కకు తోసేసి దురుసుగా ప్రవర్తించాడు. ఆ వీడియోలు వైరల్ కావడంతో సదరు సీఐ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సీఐ తీరుపై మహిళా సంఘాలు మండి పడుతున్నాయి.

ఆరేళ్లుగా నియోజకవర్గంలోనే పోస్టింగ్...

పత్తిపాటి పుల్లారావుకు బంధువంటూ చెప్పుకొనే సీఐ సుబ్బనాయుడు గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో ఎస్ఐగా చిలకలూరిపేట టౌన్, రూరల్, నాదెండ్ల పోలీసుస్టేషన్లలో దాదాపు ఐదేళ్ల పాటు పనిచేశాడు. ఆ సమయంలో ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారులు విచారణ చేశారు. చర్యలు తీసుకోకుండా అప్పుడు పత్తిపాటి పుల్లారావు మంత్రిగా ఉండి సుబ్బనాయుడుకు అండగా నిలిచాడు. దీన్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి రాగానే సుబ్బనాయుడును చిలకలూరిపేట రూరల్ సీఐగా పోస్టింగ్ వేయించారు. అప్పటి నుంచి పత్తిపాటి అక్రమాలను ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసుల బనాయింపు బాధ్యతను సదరు సీఐకి అప్పగించాడు. రెడ్డిగారి అమ్మాయి సుధారాణి, రాకేష్ గాంధీ, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కందుల శ్రీకాంత్ తదితరులపై తప్పుడు కేసులను తన సర్కిల్ పరిధిలో నమోదు చేయించాడు.

టీడీపీ కార్యాలయంగా సర్కిల్ స్టేషన్...

సీఐ సుబ్బనాయుడు తన కార్యాలయంలో ఎప్పుడు టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులను కూర్చొబెట్టుకొని సెటిల్‌మెంట్ వ్యవహారాలను చక్కబెడుతుంటాడు. ఆయన్ను కలిసేందుకు ఎవరైనా వస్తే గంటల కొద్ది వేచి ఉండాల్సిందే. టీడీపీ కార్యకర్తలను అతని ఎదుటే కూర్చొబెట్టుకొని వచ్చిన ఫిర్యాదుదారులతో సమస్య ఏంటో చెప్పాలని అడుగుతుంటాడు. వీరు చెప్పేలోగే గత ఎన్నికల్లో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసిన కారణంగా ఇబ్బందులు తప్పవని అధికారపార్టీ వాళ్లు తిట్టినా, కొట్టినా మిన్నుకుండాలని లేదంటే పార్టీ మారాలని సలహాలిస్తుంటాడు. తన సామాజిక వర్గానికి చెందిన వారు ఎవరైనా వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా ఉంటే వారిని ఈ పార్టీలో ఎలా కొనసాగుతున్నారని, టీడీపీలోకి వెళ్లాలని హెచ్చరిస్తున్నాడు. పార్టీలో చేరితే మీకు తగిన ప్రాధాన్యత ఇచ్చేలా పుల్లారావుతో నేరుగా మాట్లాడే బాధ్యత తనదంటూ భరోసానిస్తున్నాడు.

అక్రమార్జనలో సూపర్ సుబ్బ నాయుడు

సీఐ సుబ్బనాయుడు అవినీతిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రానైట్ అక్రమ రవాణా నుంచి రేషన్ బియ్యం వరకు నెలవారీ మామూళ్లు తీసుకొని జిల్లా సరిహద్దులను దాటిస్తుంటాడు. టీడీపీ నేతలు నిర్వహించే పేకాట శిబిరాలకు సహకరిస్తుంటాడు. దీంతో నాదెండ్ల మండలం, చిలకలూరిపేట రూరల్ పరిధిలో అక్రమార్కులు పెద్ద ఎత్తున పేకాట శిబిరాలు వెలిశాయి. పందెం రాయుళ్లు ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు రోజు వచ్చిపోతున్నారు. రూ.కోట్లలో చేతులు మారుతున్నాయి. ఇటీవల నాదెండ్ల మండలానికి చెందిన ఓ క్రికెట్ బుకీని బెదిరించి రూ.10 లక్షలు వసూలు చేసినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో సదరు బుకీని, సీఐను పిలిపించి విచారించినట్టు తెలుస్తోంది.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- మాచర్లలో పీజీఆర్ఎస్ నిర్వహణ



మాచర్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. సోమవారం పట్టణంలోని వి.వి.ఎస్.గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రజలు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మొత్తం 574 అర్జీలు అందాయి. ఎక్కువగా భూ సమస్యలు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మాల ఏర్పాటు, మంచినీటి సమస్యలపై అర్జీలు వచ్చాయి. గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ, ఆయా మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, కమిషనర్ వేణుబాబు, సాయిశంకర్, నాగార్జున సాగర్ కుడికాలువ డిస్ట్రిబ్యూషన్ చైర్మన్ అంజయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దుర్గారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 513.00 అడుగుల వద్ద ఉంది. ఇది 136.8190 టీఎంసీలకు సమానం.

న్యూస్‌రీల్

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు



అమరావతి: బుద్ధ జయంతి వేడుకలను ధాన్యకటక బుద్ధవిహార ట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక పాత మ్యూజియంలోని మహా చైత్యం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ వావిలాల మాట్లాడుతూ 2569 ఏళ్ల క్రితం గౌతమ బుద్ధుడు నడయాడిన అమరావతి నగరం దక్షిణ భారతదేశంలో బౌద్ధ ధర్మానికి కేంద్ర బిందువుగా కొనసాగిందన్నారు. సాక్షాత్తు గౌతమ బుద్ధుడు తన మొదటి కాలచక్ర క్రతువులు అమరావతి నుంచే ప్రారంభించారని బౌద్ధ సాహిత్యకారుల నమ్మకమన్నారు. అందుకే ఇక్కడ బుద్ధుని అస్థికలతో కూడిన మహా చైత్యం అనే గొప్ప కట్టడాన్ని నిర్మించారన్నారు. తొలుత మహాస్తూపం వద్ద ప్రత్యేక పూజాకార్యక్రమాలు, బౌద్ధమత ప్రార్థనలు నిర్వహించారు. నిమ్మా విజయసాగర్ బాబు, కోలా వెంకటేశ్వర రావు, యోగాశ్రమ నిర్వాహకులు కోనూరు అప్పారావు ప్రఫుల్ల రాణి, గిరి స్వామి, పలువురు బౌద్ధ మతస్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పల్నాడు జిల్లా పరిధిలో 30 పరీక్ష కేంద్రాలలో మొదటి సంవత్సరం పరీక్షకు 93.34 శాతం, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 87.99 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు సెట్–3 ప్రశ్నపత్రాన్ని లాటరీ ద్వారా ఎంపిక చేశారు. జూనియర్ ఇంటర్‌కు 3,132 మంది జనరల్ విద్యార్థులకుగాను 2,945మంది హాజరయ్యారు. 154 మంది ఒకేషనల్ విద్యార్థులకుగాను 122మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు జనరల్ విద్యార్థులు 413 మంది నమోదు కాగా 364 మంది, ఒకేషనల్ విద్యార్థులు 70మందికి గాను 61 మంది హాజరయ్యారు. జిల్లా పరిధిలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి కె.సుచరిత తెలిపారు.

ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా టీవీఎస్‌జీ కుమార్

నరసరావుపేట: పల్నాడు జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(కేఆర్ఆర్‌సీ–కోనేరు రంగారావు కమిటీ)గా టీవీఎస్‌జీ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈ పోస్టులో ఆర్.కుముదిని సింగ్ పనిచేశారు.

సమస్యలను వారంలో పరిష్కరిస్తాం



కొల్లిపర(తెనాలి): తమకు అందిన ప్రతి సమస్యను వారంలో పరిష్కరిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా కొల్లిపరలో మంత్రి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహతో కలిసి 200 వినతులు స్వీకరించారు. వీటిలో అత్యధికంగా బియ్యం కార్డుల దరఖాస్తులే ఉన్నాయి. అనంతరం మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా కోటి 46 లక్షల మందికి రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు.

నేడు ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో), మండల పరిపాలనాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ పరిధిలో అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షిస్తామని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీవోలు, మండల పరిపాలనాధికారులు అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో హాజరు కావాలని సూచించారు.

కల్యాణ వైభోగమే..!



సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు తెస్తున్న భక్తులు

- వైభవంగా సొలస శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు
- రంగనాథుడి కల్యాణం చూసి తరించిన భక్తులు

యడ్లపాడు: సొలస శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఆలయ ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చకుడు పర్చూరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో రంగనాథుడు, శ్రీదేవి, భూదేవి నవ వధువరులుగా సర్వాంగ శోభితంగా అలంకారకృతులై భక్తులకు దర్శనమిచ్చారు. బాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్ఛారణలు, అశేష భక్తజనాల నడుమ శ్రీదేవి, భూదేవి కల్యాణ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కమనీయమైన ఆ కల్యాణ దృశ్యాలను దగ్గరగా చూసిన భక్తులు ఆనంద పరవశులయ్యారు. కల్యాణం అనంతరం దేవతామూర్తులు హనుమత్, గరుడ వాహనాలపై అధిరోహించి పురవీధుల్లో విహరింపజేశారు. తమ ఇళ్ల ముందుకే వచ్చిన స్వామివారిని కన్నులారా దర్శించుకుని భక్తులు పూజలు చేశారు. కొందరు ఆయా వాహన సేవల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వరకు రంగనాథుడిని స్మరిస్తూ భక్తులు తరించారు.



కల్యాణ పూజలు నిర్వహిస్తున్న ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు



హనుమత్ వాహనంపై గ్రామోత్సవంలో దర్శనమిస్తున్న స్వామివార్లు

త్రికోటేశ్వరునికి లక్ష మల్లెలతో అర్చన



నరసరావుపేట రూరల్: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామివారికి సోమవారం రాత్రి లక్ష మల్లెపూల అర్చనను వైభవంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున మల్లెపూలలో స్వామివారికి అర్చన నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మహా ప్రదోష కాలంలో నిర్వహించిన అర్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా మల్లెపూలతో స్వామివారిని అర్చించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావులు అర్చనలో పాల్గొన్నారు. ఉదయం స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. ఆలయ ఈఓ డి.చంద్రశేఖర్, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సిండికేటై ముమ్మల్ని బలి చేశారు

- గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కిన నల్లబర్లీ పొగాకు రైతులు
- కంపెనీలు లేదా ప్రభుత్వమే కొనాలని డిమాండ్



యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నల్లబర్లీ పొగాకు రైతులు, రైతు సంఘం నాయకులు

యడ్లపాడు: యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబర్లీ పొగాకు రైతులు సోమవారం ధర్నా చేపట్టారు. నల్లమడ రైతుసంఘం నాయకుడు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు నేతృత్వంలో రైతు సంఘం నాయకుడు కల్లూరి రామారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ ఆందోళన కార్యక్రమంలో పలు రైతుసంఘాలు నాయకులు పాల్గొని తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలోని పొగాకు సాగు రైతులు సమష్టిగా పాల్గొని తమ గోడును అధికారులకు, వివిధ సంఘాల నాయకులకు వినిపించారు. రైతుసంఘం నాయకుడు నూతలపాటి కాళిదాసు మాట్లాడుతూ గతేడాది నల్లబర్లీ పొగాకును క్వింటాల్ రూ.18 వేల వరకు కొనుగోలు చేసిన కంపెనీలు, ఇప్పుడు అంతా సిండికేటై కేవలం రూ.4వేలు– రూ.5వేలకు ధరను దిగజార్చడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా పొగాకు రైతుల సమస్యను పరిష్కరించకుండా, కార్పొరేట్ సంస్థలకే మేలు జరిగేలా ప్రభుత్వం వ్యవహరించడంపై నిరసిస్తూ రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అనంతరం నాయకులతో కలిసి రైతులు డీటీ అనురాధకు వినతి పత్రాన్ని అందించారు.

గిట్టుబాటు ధర లేదు..



8 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. మొత్తం రూ.7 లక్షలు ఖర్చయింది. తీరా అమ్ముదామంటే గిట్టుబాటు ధర లేదు. పొగాకు దిగుబడులను ఇంట్లో పెట్టే అవకాశం లేదు. వేసిన పంటంతా పొలంలోనే ఉంది. వర్షం పడితే ఏం చేయాలి? వచ్చిన పంటను అమ్మకుండా, చేసిన అప్పులు తీర్చకుండా ఉంటే కొత్తగా సాగు ఎలా చేయాలి?

– వణుగూరి శ్రీనివాసరెడ్డి, పొగాకు రైతు, యడ్లపాడు

రూ.4లక్షలతో సాగుచేస్తే ...



గ్రామంలో 5 ఎకరాల్లో నల్లబర్లీ, 4 ఎకరాల్లో ఎఫ్‌సీఆర్ఎస్ రకాల పొగాకు సాగు చేశాను. ఎఫ్‌సీఆర్ఎస్ సాగు సమయంలో ఎలాంటి గైడ్‌లైన్స్ ఇవ్వలేదు. దీంతో రూ.4 లక్షలతో సాగు చేస్తే 60 చెక్కులు అయ్యాయి. వాటిలో 24 మాత్రమే కొన్నారు. దీనికి రూ.1.50 లక్షల వచ్చాయి. మిగిలిన వాటిని నాణ్యత లేదంటూ తిరస్కరించారు. కనీసం దాని నాణ్యత ఆధారంగానైనా కొనాలని వేడుకున్నా పట్టించుకోలేదు.

– పాలూరి శ్రీనివాసరెడ్డి, సొలస

రూ.15వేలకు తగ్గకుండా కొనాలి



నల్లబర్లీ రకాన్ని కంపెనీ లేదా ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాల్ ధర రూ.15వేలకు తగ్గకుండా కొనాలి. స్వామినాథన్ కమిటీ సిఫార్సును ప్రభుత్వం అమల్లోకి తేవాలి. రైతు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించి వారికి భరోసా ఇవ్వాలి. ఆ ధర వచ్చేవరకు రాజీపడేది లేదు. వచ్చే ఖరీఫ్‌కు సాగు చేసేది లేదు.

– ఘంటా మురళి, పొగాకు రైతు, జాలాది

నిర్విరామ నృత్య ప్రదర్శన



నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో విజయమాధవి సేవ సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు విజయమాధవికిశోర్ ఆధ్వర్యంలో జరగ్గా, 12 గంటల పాటు రత్నాచార్యులు, నృత్య కళాకారులు చేపట్టిన నృత్యాలు అలరించాయి. సినీ నటులు రాగిణి, నాగమణి, టి.రజినీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి యువకుడు బలి

- మద్యం తాగిన యువకుడు చీరాల కార్తిక్
- రెండు రోజుల కిందట ఎంపీడీఓ కార్యాలయంలో మృతి
- మద్యం తాగడం వల్లే మృతి అంటూ ధ్రువీకరించిన వైద్యులు



సంఘటనా స్థలంలో చీరాల కార్తిక్ మృతదేహం

నరసరావుపేట టౌన్: కూటమి మద్యం ఓ యువకుడిని బలి తీసుకుంది. మద్యం తాగిన యువకుడు అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన చీరాల కార్తిక్(27) ప్రస్తుతం బరంపేట విద్యుత్ శాఖ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం రాత్రి మృతి చెంది పడి ఉన్నాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి ఆదివారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని తండ్రి చీరాల వెంకయ్యకు అప్పగించారు. మృతదేహాన్ని పరీక్షించిన వైద్యులు మద్యం తాగడం వల్లే మృతి చెందాడని సోమవారం ధ్రువీకరించారు.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలుశిక్ష

ముప్పాళ్ల: హత్యాయత్నం కేసులో ముద్దాయిలకు జైలు, జరిమానా విధిస్తూ సత్తెనపల్లి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వి.విజయ్‌కుమార్‌రెడ్డి సోమవారం తీర్పునిచ్చారు. ఎస్‌ఐ వి.సోమేశ్వరరావు తెలిపిన వివరాలు.. మండలంలోని లంకెలకూరపాడుకు చెందిన చిట్యాల శ్రీనివాసరెడ్డి కుమార్తెను నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన పుట్లూరి నాగేశ్వరరెడ్డి 2021 జనవరి 16వ తేదీన ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ విషయమై చిట్యాల శ్రీనివాసరెడ్డి కుటుంబానికి పుట్లూరి నాగేశ్వరరెడ్డి కుటుంబానికి మధ్య గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో పుట్లూరి నాగేశ్వరరెడ్డి, పుట్లూరి కోటిరెడ్డి, ఏరువ తిరుపతిరెడ్డితో కలసి చిట్యాల శ్రీనివాసరెడ్డిపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనపై శ్రీనివాసరెడ్డి అన్న బాబుల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేర ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో సత్తెనపల్లి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ముగ్గురికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటుగా వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసుకు న్యాయవాదిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు, కోర్టు కానిస్టేబుల్ ఎస్‌కే జలీల్ చొరవ చూపారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో టెన్త్ సప్లిమెంటరీ హాల్ టికెట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 19 నుంచి జరగనున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల హాల్ టికెట్లను హెచ్‌ఎం లాగిన్‌తో పాటు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని డీఈఓ సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు దరఖాస్తు చేసిన పాఠశాలల హెచ్‌ఎంలు బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా తమ లాగిన్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా విద్యార్థులు 95523 00009 నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేయడం ద్వారా విద్యాసేవలను ఎంపిక చేసుకుని, తమ పేరు, పుట్టిన తేదీ, పాఠశాల పేరు, జిల్లా పేరు వివరాలతో హాల్ టికెట్లు పొందవచ్చని తెలిపారు.

ఈ నెల 20కి డీసెట్ గడువు పొడిగింపు

డైట్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించనున్న డీసెట్–2025 దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ సీవీ రేణుక తెలిపారు.

స్థలం కోసం కొడుకే వేధిస్తున్నాడు..

‘నేను బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసి పదవీ విరమణ చేశా. నాకు పట్టణ షాలెంనగర్‌లోని వైఎస్సార్ బొమ్మ వద్ద సొంత స్థలం ఉంది. దానిని తనపేరుపై రాయాలంటూ రెండు నెలల నుంచి కొడుకు ప్రసాద్, మనుమడు దర్శన్ దౌర్జన్యం చేస్తున్నారు. వారికి ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతున్నారు. సుమారు ఆరు నెలల క్రితం ఇంటి మీదకు వచ్చి నన్ను బెదిరించి స్థలం కాగితాలు బలవంతంగా లాక్కొని వెళ్లారు.’ వారిపై చర్య తీసుకోవాలని వేముల మోహనరావు ఎస్పీని వేడుకున్నారు...



బాధితుల సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

- ఓ తండ్రి ఎస్పీకి ఫిర్యాదు
- పీజీఆర్ఎస్‌కు 75 ఫిర్యాదులు

నరసరావుపేట: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 75 ఫిర్యాదులు ఎస్పీ స్వీకరించారు. ఎస్పీ అర్జీదారులతో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషి చేయాలని ఆదేశించారు.

రూ.60 లక్షలకు సమాధానం చెప్పట్లేదు

భారత సైన్యంలో పనిచేసి పదవీ విరమణ చేసిన డి.హరిశంకర్ అనే వ్యక్తి పల్నాడు కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు ఏర్పాటు చేశారు. ఆర్డీలు, చిట్టీలు వేస్తూ జనం దగ్గర డబ్బులు కట్టించుకున్నారు. సుమారు పదిమంది బాధితుల వద్ద రూ.60 లక్షలు కట్టించుకుని వారికి సమాధానం చెప్పకుండా ఇబ్బంది పెడుతున్నాడు. కొన్ని రోజుల క్రితం బ్యాంకును వేరే వ్యక్తులకు అప్పగించారు. ప్రస్తుతం 60 లక్షల దాకా రావాల్సిన డబ్బుకు ఎటువంటి సమాధానం చెప్పకుండా ఇబ్బంది పెడుతున్నారు.

–సువర్ణలక్ష్మి, చిలకలూరిపేట పట్టణం

నాకు బతుకు తెరువు చూపించండి

నా భర్త యలమంద. 24 ఏళ్ల క్రితం ఆక్సిడెంట్‌లో చనిపోయాడు. ఏడాదిన్నర క్రితం నా కుమారుడు క్యాన్సర్‌తో చనిపోయాడు. నా మామ అయిన కోటేశ్వరరావు నాకు ఎలాంటి ఆస్తి ఇవ్వనని బెదిరిస్తున్నాడు. ఏ ఆధారంలేని నాకు కొంత ఆస్తి ఇప్పించి బతుకు తెరువు చూపించాలి.

–తీసుపోగు మరియమ్మ, కరాలపాడు, పిడుగురాళ్ల మండలం

భర్త చిత్రహింసలు పెడుతున్నాడు..

నాకు 14 ఏళ్ల క్రితం దిడ్ల మహేష్‌తో వివాహమైంది. ఇద్దరు పిల్లలు. వివాహానికి ముందు నుంచే మద్యం అలవాటు ఉంది. నా భర్త డబ్బుల కోసం నన్ను కొడుతూ ఇబ్బందులు పెడుతూ ఇల్లు, సంసారం అనే బాధ్యత లేకుండా ప్రతినిత్యం తాగుతున్నాడు. అదేమని అడిగితే చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకోవాలి.

–దిడ్ల అనిత, పెదకూరపాడు

రూ.1.80 లక్షలు తీసుకొని ఇవ్వట్లేదు

నా భర్త 20 ఏళ్ల క్రితం చనిపోయాడు. ప్రస్తుతం కూతురి వివాహం చేసి అప్పుల పాలై ఇబ్బంది పడుతున్నా. గతంలో నేను గ్రామానికి చెందిన రుద్రోజు నాగేశ్వరరావుకు రూ.1.80 లక్షలు వడ్డీకి ఇచ్చా. ఆ డబ్బులు ఇవ్వమని ఎన్నిసార్లు అడిగినా, పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా కూడా ఇవ్వట్లేదు. అతడి వద్ద డబ్బులు ఇప్పించాలి.

–పాలపాటి నారాయణమ్మ, దుర్గి

నూజెండ్ల రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోండి

రైతులు, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

నరసరావుపేట: ప్రభుత్వం పేద రైతులకు ఇచ్చిన భూముల నుంచి వారిని బలవంతంగా ఖాళీ చేయించే నూజెండ్ల రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ భూములకు చెందిన రైతులు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నూజెండ్ల మండలం ముక్కెళ్లపాడులో సర్వేనెంబర్ 783, 784లలో గతంలో పేదలకు డీకే పట్టాలు, బీ ఫారం పట్టాలు పంపిణీ చేశారన్నారు. నాటి నుంచి నేటి వరకు అవి సాగుచేసుకుని వారు జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఈ భూములను మిలటరీ వాళ్లకు కేటాయించారని, వారికి భూమి చూపించడానికి మేము



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, ప్రజాసంఘాల నాయకులు

వచ్చామంటూ మీ దగ్గర కాగితాలు తహసీల్దార్‌కు చూపించాలని, వారికి పోను మిగతా భూమిలో ఖాళీ ఎక్కడుంటే అక్కడ మీకు కేటాయిస్తారని, భూమి తీసుకునే వాళ్లు మీకు పొక్లెయిన్‌తో బాగు చేసి ఇస్తారంటూ ముక్కెళ్లపాడు వీఆర్వో బాలకిషోర్ రైతులతో చెప్పారన్నారు. అయితే రైతులు మాత్రం ప్రభుత్వం తమకు ఇచ్చిన భూమిని వదిలి ఎక్కడకు పోమని, ఇక్కడే ఉంటామని తెలియచేశారన్నారు. తహసీల్దార్, రైతులను బలవంతంగా రైతులను ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై తాము నూజెండ్ల రెవెన్యూ అధికారులపై విచారణ నిర్వహించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఇచ్చిన అర్జీపై ఆర్డీఓతో విచారణ చేయిస్తామని కలెక్టర్ కార్యాలయ ఏఓ హామీ ఇచ్చారన్నారు. రైతులు శివాజీ రామంజి, హనుమంతరావు, మారుతీరావు, అరుణ్ కుమార్, సుహాసిని, ప్రసన్న, భవాని, పీడీఎం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, బీసీ నాయకులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలి

కలెక్టరేట్ ఎదుట యూటీఎఫ్ ధర్నా

నరసరావుపేట: పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునవ్యవస్థీకరణ ప్రక్రియతో పాటు ఏ విధమైన స్పష్టమైన జీఓలు లేకుండా రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పాఠశాల విద్యాశాఖ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏఓకు వినతిపత్రం సమర్పించారు. తొలుత జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 117 రద్దు చేసి దాని స్థానంలో కొత్త జీఓ విడుదల చేసి పాఠశాలలను పునవ్యవస్థీకరించాలని కోరారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. అన్నీ మోడల్, ప్రైమరీ పాఠశాలల్లో ఐదు తరగతులు బోధించడానికి ఐదుగురు ఉపాధ్యాయులను, విద్యార్థుల సంఖ్య 120కి మించితే ఆరుగురు ఎస్జీటీలను, ఆ పైన ప్రతి 30 మందికి ఒక ఎస్జీటీ చొప్పున కేటాయించాలని అన్నారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించి వారిని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మాత్రమే నియమించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియాన్ని కొనసాగించాని, తరగతిలో విద్యార్థులు 45 మించితే రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలని సూచించారు. హైస్కూలులో విద్యార్థుల



కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సంఖ్య 300 దాటితే అదనపు పీడీ పోస్టు కేటాయించాలని కోరారు. బదిలీల జీఓ విడుదల చేసి వేసవి సెలవులలో ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఎస్.జీ.టి.లకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ చేపట్టాలన్నారు. జిల్లాలో సీనియారిటీ సమస్యలు పరిష్కరించిన తర్వాతనే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, బదిలీలు, పదోన్నతులు ప్రక్రియలు వేర్వేరుగా నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ ఖాసీం పీరా, సహాధ్యక్షులు ఏ బాగేశ్వరిదేవి, జేవీడీ నాయక్, కోశాధికారి ఎం.రవిబాబు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్, జిల్లా ఇన్‌చార్జి టీఎస్ఎన్ మల్లీశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ఉషాశౌరి రాణి, టి.వెంకట్, కె.తిరుపతిస్వామి, ఆర్.నాసర్‌రెడ్డి పాల్గొన్నారు.

బంగారం ఆభరణాలు చోరీ

- విలువ సుమారు రూ.17 లక్షలు
- ఆటోలో వెళ్తుండగా మాయం


పిడుగురాళ్ల: బ్యాంక్ నుంచి బంగారు ఆభరణాలను తీసుకొని వెళ్తుండగా ఆటోలో మాయమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మాచవరం మండలం చెన్నాయపాలెం గ్రామానికి చెందిన ఓ మహిళ, పిడుగురాళ్ల పట్టణంలోని తమ్ముడు యడ్లవల్లి పుల్లారావు సహాయంతో పట్టణంలోని చైతన్య గోదావరి బ్యాంక్ లాకర్‌లో ఉన్న నగలను తీసుకుంది. పిడుగురాళ్ల పట్టణంలోని చెన్నాయపాలెం వెళ్లే ఆటో వద్దకు వెళ్లారు. ఊరు వెళ్తుండగా వీరితో పాటు మరికొంత మంది ఆటో ఎక్కి బ్రాహ్మణపల్లి సమీపంలో దిగారు. వారు దిగి వెళ్లిన తరువాత బ్యాగ్ చెక్ చేసుకోగా నగలు కనిపించలేదు. దీంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగల బాక్స్‌లో నెక్లెస్, లాకెట్, చంద్రహారం, లాకెట్, నానుతాడు, ఐదు వరసల ఉంగరాల చంద్రహారం మొత్తం 170 గ్రాములు ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ ఐదు గ్రామాలలో మట్టి తవ్వకాలు చేస్తే చర్యలు

అమరావతి: మండల పరిధిలోని పెదమద్దూరు, వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, లేమల్లె గ్రామాలలో రాజధాని నగర నిర్మాణం కోసం లాండ్ పూలింగ్ ప్రక్రియలో భాగంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ డానియేల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామాలలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా గ్రామాల వీఆర్వోలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, ఆదేశాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

గుంటూరు రూరల్: భర్త వేధింపులు భరించలేక వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న ఆమె మృతదేహాన్ని పలు నాటకీయ పరిణామాల మధ్య అంబులెన్స్‌లో గుంటూరు శివారు ఓబులనాయుడుపాలేనికి తరలించడంపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధితులు, నల్లపాడు పోలీసుల కథనం ప్రకారం... ప్రత్తిపాడు మండల యనమదల గ్రామానికి చెందిన హేమలతకు 2020లో ఓబులనాయుడుపాలెం గ్రామానికి చెందిన మురళీతో కులాంతర వివాహం జరిగింది. హేమలత హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. పెళ్లి అనంతరం కాపురాన్ని హైదరాబాద్ లింగంపల్లి ప్రాంతానికి మార్చారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. భర్త మురళి జులాయిగా తిరుగుతూ, బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. డబ్బులు కోసం నిత్యం భార్యను వేధింపులకు గురిచేస్తూ ఉండేవాడు. చేసేదిలేక హేమలత తన శక్తికి మించి రుణాలు చేసి అడిగిన మొత్తం సర్దుబాటు చేసేది. ఇటీవల భర్త వేధింపులు ఎక్కువయ్యాయి. ఆదివారం భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో తెలియదు. హేమలత అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు చెప్పకుండా భర్త ఆమె మృతదేహాన్ని నేరుగా అంబులెన్స్‌లో ఓబులనాయుడుపాలేనికి తీసుకొచ్చాడు. విషయం తెలుసుకున్న హేమలత కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలి తండ్రి కోటేశ్వరరావు నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వంశీధర్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ నారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జీరో ఎఫ్ఐఆర్ చేసి కేసును హైదరాబాద్ చందానగర్ స్టేషన్‌కు బదిలీ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



హేమలత మృతదేహం

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

నరసరావుపేట రూరల్: జవాబుదారితనంతో బాలల హక్కులను పరిరక్షించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి కోరారు. మండలంలోని జొన్నలగడ్డ, పెట్లూరివారిపాలెం, పమిడిపాడు, ఉప్పలపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న టీహెచ్ఆర్ టేక్ హోమ్ రేషన్ సక్రమంగా అందుతుందా లేదా ఆరా తీశారు. నాదెండ్ల మండలం సాతులూరులోని గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. పద్మావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించాల్సిన బాధ్యత ఐసీడీఎస్‌పై ఉందని చెప్పారు. ఎండల తీవ్రత దృష్ట్యా చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సరైన సమయంలో పాలు, గుడ్లు అందించాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను బావులకు దగ్గరగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. బాల్యవివాహాలు మీ పరిసరాల్లో జరగకుండా సిబ్బంది పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓలు ఉమామహేశ్వరి, శాంతకుమారి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

వినియోగదారుల హక్కులు కాపాడాలి

తూనికలు కొలతలు శాఖ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య

సత్తెనపల్లి: మార్కెట్‌లో వినియోగదారులకు విక్రయించే ప్రతి వస్తువుపై పక్కా సమాచారం ఉండాలని తూనికలు, కొలతలు శాఖ పల్నాడు జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ నల్లబోతుల అల్లూరయ్య అన్నారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ కల్యాణ మండపంలో తూనికలు, కొలతల శాఖ వారోత్సవాల్లో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. అల్లూరయ్య మాట్లాడుతూ వినియోగదారులకు విక్రయించే ప్రతి వస్తువుపై వస్తువు తయారీ తేదీ, గడువు ముగిసే తేదీ, ప్యాకింగ్ కంపెనీ పేరు, అడ్రస్సు, బార్‌కోడ్, కస్టమర్ కేర్ నంబర్.. ఇలా అన్ని విషయాలు స్పష్టంగా ఉండాలని చెప్పారు. ప్రధానంగా తూకాల్లో మోసాలు చేసినా, తప్పుడు చిరునామా కలిగిన వస్తువులను విక్రయించినా కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా బియ్యం విషయానికి వస్తే రిటైల్‌గా విక్రయించే రైస్ బ్యాగ్ 25 కిలోలు ఉండాలని, ఇది ప్రభుత్వ నిబంధన అన్నారు. కానీ కొంత మంది వ్యాపారులు 24 కిలోలు, మరికొందరు 23 కిలోల తూకంతో విక్రయాలు జరుపుతున్నారని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. హోల్‌సేల్‌గా విక్రయించే రైస్ బాగ్ 26 కిలోలు తూకం ఉండాలన్నారు. ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా మాట్లాడుతూ వినియోగదారులను ఏ రకంగా మోసగించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న అల్లూరయ్య

రెజ్లింగ్ జిల్లా జట్లకు క్రీడాకారుల ఎంపిక

అచ్చంపేట(క్రోసూరు): అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పల్నాడు జిల్లా అమ్మెచూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం రెజ్లింగ్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక చేసినట్లు రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భూషణం తెలిపారు. అండర్– 17 విభాగంలో బాలురు బి.అంజినాయక్(కారంపూడి,) కె.బుచ్చిబాబు (ఉప్పలపాడు), కె.గోపయ్య(అచ్చంపేట), ఎం.బాబు(గోరంట్ల), కేవీఎల్ చక్రధర్(వీపీ సౌత్), ఎం.వరప్రసాద్ (చిగురుపాడు), కె.నందకిషోర్(వైకుంఠపురం), కె.యోజిన్(అచ్చంపేట), ఎన్.వెంకటేశ్ (88త్యాళ్లూరు), ఎన్. హనుమంతు వెంకటేశ్(ఉప్పలపాడు), వి.వృద్ధి (చౌటపాపాయపాలెం), వి.చరణ్ (ఫణిదం), డి.కుమార్‌బాబు(లగడపాడు) ఎం.రాజుకుమార్(ఉప్పలపాడు) ఎంపికయ్యారు. అదేవిధంగా బాలికల విభాగంలో వి.లాస్య(రెంటపాళ్ల), ఆర్.గాయత్రి (వీపీ సౌత్), ఆర్.అనూషా(అడిగొప్పల), డి.నేహశ్రీ(బ్రాహ్మణకోడూరు), అండర్– 23 విభాగంలో కె.లాలూనాయక్ (,రామాంజనేయపురం తండా), ఆర్.శ్రీహరి(అనంతవరం), కె.కిరణ్‌కుమార్(చల్లగరిక), బి.తేజ(కొచ్చర్ల), వై.మల్లికార్జున (లోయపల్లి), కె.బాలకోటేశ్వరరావు(పిడుగురాళ్ల), మహిళల విభాగంలో కె.ధణుక బాయి, (వీపీ సౌత్), జి.నితీషా (రెంటపాళ్ల) పికైనట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16,17,18 తేదీల్లో చిత్తూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయిపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్‌టి.అరుణ్‌కుమార్ ప్రారంభించారు.



ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులు

ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతులు

జోన్–3లో 11 మంది అధ్యాపకులకు ప్రయోజనం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న 11 మంది అధ్యాపకులకు ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఇంటర్మీడియెట్ విద్యామండలి డైరెక్టర్ డాక్టర్ కె.కృతికా శుక్లా సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన అధ్యాపకులకు తాత్కాలిక ప్రాతిపదికన ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విడుదల చేసిన ఉత్తర్వుల్లో భాగంగా జోన్–3 పరిధిలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 11 మంది ప్రిన్సిపాళ్లుగా ఉద్యోగోన్నతి పొందారు.

- సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎం. శ్రీనివాసరావు పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, గుంటూరులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు బీఎస్ సురేష్ అచ్చంపేటకు, సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ అధ్యాపకురాలు యు. కోటేశ్వరమ్మ అద్దంకి జీజేసీ, నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎం. రమణారెడ్డి నెల్లూరులోని డీకే జీజేసీ, నెల్లూరులోని కేఏసీ జీజేసీ అధ్యాపకురాలు జయమాలతి టంగుటూరు జీజేసీ, నెల్లూరు డీకే జూనియర్ కళాశాల అధ్యాపకురాలు బి. కృష్ణవేణి రాపూరు జీజేసీ, దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కలవకొల్లు వాసు పొదిలి జీజేసీ, సత్తెనపల్లి జీజేసీ అధ్యాపకుడు వి.శ్రీనివాసరావు ఉదయగిరి జీజేసీ, పీపీ పాలెం జీజేసీ అధ్యాపకురాలు కె. లక్ష్మీ జ్ఞానేశ్వరి చేజర్ల జీజేసీ, వెంకటాచలం జీజేసీ అధ్యాపకురాలు జి. కరుణకుమారి వెంగమాంబపురం జీజేసీ, టంగుటూరు జీజేసీ అధ్యాపకుడు పి. సద్గుణరావు కొమరోలు జీజేసీకి ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి పొందారు. సంబంధిత అధ్యాపకులందరూ వారం రోజుల్లోగా కళాశాలల్లో ప్రిన్సిపాల్స్‌గా చేరాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

రోగికి కేసు షీట్ ఇవ్వాల్సిందే..!

జాతీయ వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు

గుంటూరు మెడికల్: రోగికి కేసు షీటు ఇవ్వాల్సిందేనని జాతీయ వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు అన్నారు. గుంటూరులోని గర్తపురి కన్జ్యూమర్స్ కౌన్సిల్ ఆఫీసులో సోమవారం వైద్య వివరాలు, హాస్పిటల్స్ విధులపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి చేకూరి రాజశేఖర్ అధ్యక్షత వహించారు. డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రెగ్యులేషన్స్ ప్రకారం రోగ నిర్ధారణ, పరిశోధన వివరాలు రోగికి తప్పనిసరిగా వైద్యాధికారులు తెలియజేయాలని తెలిపారు. రోగి మరణిస్తే అన్ని కారణాలు ఆ కేసులో తెలపాలని చెప్పారు. వైద్యులు ఏ మందులు ఎప్పుడు వాడారు..నర్సింగ్ సిబ్బందికి చెప్పిన సూచనలు కేసులో తేదీల వారీగా ఉండాలని, చికిత్స వివరాలు సమగ్రంగా ఉండాలని తెలిపారు. రోగి గానీ, అతని బంధువులు గానీ మెడికల్ రికార్డులు కావాలని అడిగిన తరువాత 72 గంటల్లో అందించాలని సూచించారు. రాజశేఖర్ మాట్లాడుతూ రోగికి రికార్డు ఇవ్వకుండా మెడికల్ ప్రాక్టీషనర్‌కు ఏ మినహాయింపు, ఏ చట్టం ఇవ్వలేదని తెలిపారు. మొత్తం చికిత్స వివరాల ఫొటో కాపీలు హాస్పిటల్ వారు ఇవ్వాలని సూచించారు. జిల్లా విజిలెన్స్ సభ్యుడు బీరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ హాస్పిటల్ వారు రోగికి వైద్య వివరాలను నిరాకరించడమంటే తన బాధ్యత నిర్వహణలో నిర్లక్ష్యమవుతుందని తెలిపారు. న్యాయస్థానాలు కోరినప్పుడు తప్పనిసరిగా సంబంధిత రోగి రికార్డులు సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. బేబీ సరోజిని మాట్లాడుతూ వైద్యులు తప్పు చేసి ఉంటే అందువల్ల నష్టపోయిన రోగులు, కేసు షీటును సాక్ష్యాధారంగా కోర్టులో ఉపయోగించవచ్చని తెలిపారు. మునిపల్లె కవిత మాట్లాడుతూ రోగులకు చికిత్స చేసిన వివరాలను అందించడంలో పూర్తి పారదర్శకత ఉండాలని సూచించారు. కేసు సీట్ బాధ్యత వైద్యులు, హాస్పిటల్ పైన ఉందని చాలా కేసుల్లో కోర్టులు తీర్పులు ఇచ్చాయని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు, పక్కన డాక్టర్ చదలవాడ హరిబాబు తదితరులు